క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

నరసన్నపేట: స్థానిక పోలాకి రోడ్డులోని గోరు వానిచెరువు గట్టుకు ఆనుకొని చేపడుతున్న నిర్మాణాన్ని పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం తొలగించారు. చెరువు గట్టుకు ఆనుకొని ప్రభుత్వ స్థలంలో భవనం నిర్మాణానికి సన్నాహాలు చేస్తుండగా సమాచారం తెలుసుకొని పంచాయతీ ఈవో నవర చిన్నారావు, వీఆర్వో అప్పలనాయుడు తదితరులు వెళ్లి తొలగించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఈ ఆక్రమణలు తొలగించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


దరఖాస్తులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పొందూరు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని తాడివలస ఉన్నత పాఠశాల హెచ్ఎం బల్ల కంటయ్య అన్నారు. తాడివలస గ్రామంలో ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల ఇంటి వద్దకు శుక్రవారం వెళ్లి, తమ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు దరఖాస్తులు అందజేశారు. తాడివలస పాఠశాలలో అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూజారి హరిప్రసన్న, చౌదరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

పొందూరు: ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన తాడివలస ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు హెచ్ఎం బల్ల కంటయ్య చేతులు మీదుగా నగదు ప్రోత్సాహక బహుమతులను శుక్రవారం అందజేశారు. ఆమదాలవలస మండలం లొద్దలపేట గ్రామానికి చెందిన విశ్రాంత సీఆర్పీఎఫ్ జవాను పైడి శ్రీనివాసరావు ప్రకటించిన రూ.6 వేలను సీపాన దీపిక, మెట్ట లక్ష్మి, కూన రేవతిలకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొబ్బరి పెంపకంపై దృష్టి సారించాలి


కొబ్బరి మొక్కల నర్సరీ

బూర్జ: కొబ్బరి మొక్కల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని పెద్దపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.వి.కె భగవాన్ సూచించారు. ఉద్యాన పరిశోధన స్థానంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వ్యవసాయ రైతుల అభివృద్ధి కోసం పెద్దపేటలో కొచ్చి కేరళ కోకోనట్ డవలప్మెంటు బోర్డు వారి ఆర్థిక సహాయంతో సుమారు 10 వేలు మొక్కలు నర్సరీలో పెంచడం జరుగుతోందన్నారు. ఇక్కడ పెంచిన దేశవాళీ కొబ్బరి మొక్కలు ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఒక్కొక్క మొక్క రూ.100 చొప్పున రైతులకు విక్రయించడం జరుగుతుందన్నారు. ఈ మొక్కల్లో వాణిజ్య పంటలుగా అంతర పంటలు వేసుకుంటే రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని తెలియజేశారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

9 మంది చిన్నారులు గుర్తింపు


దివ్యాంగ చిన్నారితో సర్వే బృందం

కొత్తూరు: మండలంలోని ఈనెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ప్రత్యేక అవసరాల పిల్లల సర్వేలో భాగంగా శుక్రవారం నాటికి 9 మందిని గుర్తించినట్లు ఎంఈవో గోవిందరావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు జూన్ 9వ తేదీ వరకు సర్వే చేయనున్నట్లు వెల్లడించారు. గుర్తించిన చిన్నారులకు ప్రభుత్వం నుంచి అందిస్తున్న పలు రకాల పథకాలు వర్తింపజేయడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. విద్యతో పాటు పింఛన్లు, వైద్యం, ప్రభుత్వ పథకాలు వంటివి అందేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గోవిందరావు, ఉమా, రమ్య, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

దహనంతో దిగుబడికి చేటు..!

- పొలంలో గడ్డి దహనంతో భూసారానికి ముప్పు
- పంటల దిగుబడిపై ప్రభావం


పొలంలో గడ్డిని దహనం చేసిన దృశ్యం

హిరమండలం: వ్యవసాయంలో ప్రస్తుతం కూలీల కొరత ఉండడంతో రైతులు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. వరి కోతలకు హార్వెస్టర్లను ఉపయోగిస్తుండడంతో వరి గడ్డి వినియోగం తగ్గిపోయింది. కేవలం పశువులు ఉన్నవారు మాత్రమే వరి గడ్డిని సేకరించి, మిగతావారు పొలంలోనే విడిచిపెట్టేస్తున్నారు. అనంతరం పొలాన్ని పంటలకు సిద్ధంచేసే క్రమంలో వరిగడ్డిని దహనం చేస్తున్నారు. అయితే అవగాహన లోపంతో అన్నదాతలు ఇలాంటి తప్పిదాలు చేస్తే భూసారానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇలా చేయడం వలన పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాదని చెబుతున్నారు. పంటలకు కీడు చేసే పురుగులను తినే వానపాములు, కీటకాలు నశించే ప్రమాదం ఉంది. అలాగే భూమికి సేంద్రియ పీచు పదార్థాలుగా ఉపయోగపడే అవశేషాలు, ఖనిజ లవణాలు నశిస్తాయి. వీటితో పాటు ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఎక్కువ మొత్తంలో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది.

ఇలా చేస్తే మేలు

పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. పంటకోత పూర్తయిన తర్వాత మిగిలిన పంటల అవశేషాలను భూమిలో మురగబెట్టి దుక్కిలో కలిపిదున్నాలి. ఇలా చేయడం వలన వరిగడ్డి భూమిలో మురిగి సేంద్రీయ ఖర్బనం పెరుగుతుంది. దీనివలన తర్వాత సాగుచేసే పంటకు మేలు చేకూరుతుంది. యూరియా, సూపర్‌ఫాస్పేట్, పొటాష్‌లను కలిపి పంట సాగు చేసుకొనే ముందు చల్లితే పొలంలో మిగిలిన కొయ్యలు, వరి గడ్డి రెండు వారాల్లోనే మురుగుతాయి.

భూసారం తగ్గుతుందని తెలియదు



పంటకోతకు యంత్రాలు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి మిగిలిన కొయ్యలు, గడ్డిని తగలబెడుతున్నాం. ఇలా చేస్తే భూసారం తగ్గుతుందని తెలియదు. దీనిపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

– సూరపు వెంకటరావు, పాత హిరమండలం

అవగాహన కల్పిస్తున్నాం



పంట భూముల్లో గడ్డిని, వరి కొయ్యలను దహనం చేస్తే భూసారాన్ని కోల్పోతుంది. అవసరం లేని గడ్డిని భూమిలోనే కలిపి దున్నితే సేంద్రీయ ఎరువుగా మారి, భూమికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. గడ్డి దహనంతో వాతావరణం కాలుష్యం అవుతుంది. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– బి.సంధ్య, మండల వ్యవసాయాధికారి, హిరమండలం

'నవధాన్యాలు సాగు చేయాలి'


నవధాన్యాలు సాగు చేసిన భూమిని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తూరు: వరి పంట సాగు చేయనున్న పొలాల్లో బ్లాక్‌లు వారీగా నవధాన్యాల సాగును ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయం శ్రీకాకుళం జిల్లా రీజనల్ కో–ఆర్డినేటర్లు హేమ సుందరరావు, ప్రకాశ్‌లు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఆదేశించారు. గతేడాది నవధాన్యాలు సాగు చేసిన రైతులతో కొత్తూరులో శుక్రవారం ముఖాముఖి నిర్వహించారు. వరి పంట సాగు చేసిన పొలాల్లో నవధాన్యాలు సాగు చేయడం వలన పలు రకాల లాభాలు పొందినట్లు రైతులు అల్లు ధనుంజయతో పాటు పలువురు రైతులు తెలిపారు. నవధాన్యాలు సాగు చేయడం వలన భూసారం పెరగడంతో పాటు పంటలకు ఎటువంటి తెగుళ్లు, పురుగులు ఆశించవన్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంటీ సూర్యనారాయణ, డీపీఎం షణ్ముఖరావు, గోవిందరెడ్డి, ముసలయ్య, పెట్టయ్య, చిన్నమ్మి, అల్లు భారతి, రమణమ్మ, చోవింద్, భూదేవి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

ఎల్.ఎన్.పేట: గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా మెరుగైన వైద్యం అందించేలా డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో) డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. మండలంలోని తురకపేట ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది హాజరు, రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. ఆస్పత్రిలో ప్రసవాలను పెంచాలన్నారు. తురకపేట ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో జరిగిన అస్పత్రి ప్రసవాలు గురించి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనులు చేస్తున్న సమయంలో పాములు, విషకీటకాల బారిన పడే ప్రమాదం ఉందని, పాముకాటు నివారణ మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు తగిన సూచనలు చేయాలన్నారు. ఆమెతో పాటు స్థానిక డాక్టర్ ఎ.లక్ష్మీదీప్, నీతూ తదితరులు ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

వైద్యం ప్రజలకు చేరువవ్వాలి

సరుబుజ్జిలి: వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువగా అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ముందుగా ఆస్పత్రిలో ఓపీ, ఆపరేషన్ థియేటర్, పేషెంట్ల బెడ్స్, ఆస్పత్రిలో పరిశుభ్రత గురించి పరిశీలించారు. ఆమెతో పాటు వైద్యులు సంతోష్‌కుమార్, హరిత, సీహెచ్‌వో మోహనరావు ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


కొత్తూరు: పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో త్రివిక్రమరావు


హిరమండలం:వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీవో శ్రీనివాసరావు

హిరమండలం: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీవో ఎ.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేతనదారులు సక్రమంగా పనిచేస్తే గరిష్ఠ వేతనం రూ.300 వచ్చే అవకాశం ఉందన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఉదయం, సాయంత్రం వేలల్లో మాత్రమే పనులు చేయాలని సూచించారు. ఆయనతో పాటు టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు, మేట్‌లు ఉన్నారు.

కొత్తూరు: ఉపాది వేతనదారులు గరిష్ఠ వేతనం పొందేలా పనులు చేయాలని ఎంపీడీవో త్రివిక్రమరావు సూచించారు. మండలంలోని దాసరాదీపురం, సిరువాడ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతలు ప్రకారం పనులు చేసినప్పుడు గరిష్ఠ వేతనం రూ.300 పొందగలరన్నారు. పనులకు వచ్చేటప్పుడు సమయపాలన పాటించాలని సూచించారు.

గోపాల పెంటలో కార్డెన్ సెర్చ్


కొత్తూరు: వాహనాలను తనికీ చేస్తున్న ఎస్ఐ అహ్మద్


నరసన్నపేట: గడ్డి కుప్పల్లో సోదాలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంటలో పోలీసులు శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నరసన్నపేట ఎస్ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి అపరిచితులపై వాకబు చేశారు. మద్యం, మందుగుండు సామాగ్రి వంటి నిల్వలపై ఆరా తీశారు. ఎటువంటి రశీదులు లేని నాలుగు ద్విచక్ర వాహనాలను గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి వివాదాలకు ప్రయత్నించవద్దని సూచించారు. గొడవలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహర్తాపురంలో...

కొత్తూరు: మండలంలోని మహర్తాపురం కాలనీలో స్థానిక సీఐ ఆర్.వేణుగోపాలరావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ జరిగింది. ఎన్నికలు నేపథ్యంలో కేంద్ర బలగాలతో నిర్వహించిన కార్యక్రమంలో కాలనీలో ఎటువంటి పత్రాలు లేని బైక్‌లను గుర్తించడంతో పాటు అపరిచిత వ్యక్తుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎంఏ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సప్లిమెంటరీ పరీక్షలు

హిరమండలం: ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మొదటి సంవత్సర ఇంటర్ విద్యార్థులు 82 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 18 మంది గైర్హాజరైనట్లు ప్రిన్స్‌పాల్ పీఈఎస్ పట్నాయక్ తెలిపారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి జాతర

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయతీ మన్నెపేట కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామివారి జాతర మహోత్సవాలు ఈనెల 25వ తేదీ నుంచి 27 వరకు జరగనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 25న ఉత్సవమూర్తుల తిరువీధి, 26న స్వామివారి కల్యాణం, భజనలు, 27న ఆరాధన జరుగుతాయని తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని వెల్లడించారు. భక్తులందరూ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పోలాకి: మండలంలోని మబగాం సబ్‌స్టేషన్ పరిధిలోని నూతన ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్న నేపథ్యంలో గజపతినగరం 11కే లైన్, ఫీడర్ పరిధిలోని గజపతినగరం, కత్తిరివానిపేట, పూడివానిపేట, జొన్నాం, మల్లపేట, దుబ్బకవానిపేట, తలసముద్రం, కొల్లివలస, జనావానిపేట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయ సర్వీస్‌లు సైతం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిలిపివేయబడతాయని, వినియోగదారులు గమనించాలని కోరారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి


తాడేల శ్రీకాంత్

జలుమూరు: వేసవి దృష్ట్యా ఎండ వేడిమి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అందరూ వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని జలుమూరు పీహెచ్‌సీ మెడికల్ అధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం జలుమూరు పీహెచ్‌సీలో విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటలు దాటిన తర్వాత బయటకు వెళ్లవద్దని సూచించారు. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వదులుగా ఉండే కాటన్, ఖద్దరు దుస్తులు ధరించడంతో పాటు తలకు టోపి పెట్టుకోవాలని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్తే గొడుగు తీసుకెళ్లాలని సూచించారు. వడదెబ్బ తగిలితే వైద్యుడిని సంప్రదించి సూచనలు తీసుకోవాలని, నిమ్మరసం, ఓఆర్ఎస్ ద్రావణం తాగాలన్నారు.

వైభవంగా సింహ వాహన సేవ


సింహ వాహనంలో ఊరేగుతున్న స్వామివారు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా 7వ రోజు శుక్రవారం సింహ వాహన సేవ జరిగింది. ఆలయం నుంచి సింహ వాహనంపై స్వామివారు ఊరేగారు. పెద్దపేట మీదుగా మెయిన్ రోడ్డు, పాతబస్టాండ్ కూడలి వరకూ ఊరేగింపు జరిగింది. మహిళలు ఎక్కడిక్కడ హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


స్వామివారికి అభిషేకం చేస్తున్న దృశ్యం


ఊరేగింపులో పాల్గొన్న పట్టణ ప్రజలు

21 రౌండ్లలో నరసన్నపేట ఫలితం

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియడంతో అందరూ కౌంటింగ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 1,73,827 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో మహిళలు 88,189 మంది, పురుషులు 85,638 మంది ఓటు వేశారు. అయితే జూన్ 4న కౌంటింగ్‌కు అధికారులు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎచ్చెర్లలోని శివానీ కళాశాలలో కౌంటింగ్ నిర్వహిస్తారు. మొత్తం 21 రౌండ్లలో నరసన్నపేట కౌంటింగ్ పూర్తవుతుందని ఆర్వో రామ్మోహనరావు తెలిపారు. దీనికోసం 14 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో టేబుల్‌కు 14 పోలింగ్ కేంద్రాల ఈవీఎంలు పంపి కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ లెక్కన ముందుగా జలుమూరు మండలం శ్రీముఖలింగం నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలియజేశారు. ఈ మండలంలో 74 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఐదున్నర రౌండ్లలో ఫలితం వస్తుంది. ఆరో రౌండ్ నుంచి నరసన్నపేట మండలం కౌంటింగ్ ఉంటుంది. ఈ మండలంలో 82 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నరసన్నపేట మండలం తర్వాత సారవకోట మండలం లెక్కింపునకు వస్తుందని అధికారులు వెల్లడించారు. చివరగా పోలాకి మండలంలోని పోలింగ్ కేంద్రాల లెక్కింపు జరుగుతుందని దీంతో లెక్కింపు పూర్తి అవుతుందన్నారు. అలాగే ఒక్కో టేబుల్ వద్ద మైక్రో అబ్జర్వర్, ఒక సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్ ఉంటారని పేర్కొన్నారు.

బాధితులకు సకాలంలో సేవలు


పాతపట్నం: వాహనాన్ని పరిశీలిస్తున్న జగన్


సరుబుజ్జిలి: 108ను తనిఖీ చేస్తున్న నవీన్

సరుబుజ్జిలి: బాధితులకు సకాలంలో 108 అంబులెన్స్ సేవలు అందించాలని శ్రీకాకుళం డివిజన్ అధికారి ఎల్.నవీన్ సూచించారు. మండల కేంద్రంలోని 108 వాహనాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. అంబులెన్స్ పనితీరు, అత్యవసర మందులు, డ్యూటీ రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు ఈఎంటీ మునికోటి ఈశ్వరరావు, పైలెట్ ధవళ శ్రీనివాసరావు ఉన్నారు.

పాతపట్నం: అత్యవసర సమయాల్లో మరింత బాధ్యతగా పనిచేయాలని, 108 వాహనం సేవలను ప్రజలకు అందించాలని 108 పలాస డివిజన్ అధికారి జి.జగన్ అన్నారు. పాతపట్నం సీహెచ్‌సీలో ఉన్న 108 వాహనాన్ని శుక్రవారం పరిశీలించారు. వాహనం పనితీరు, పరికరాలు, ఎమర్జెన్సీ డ్రగ్ రికార్డు, సిబ్బంది రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. బాధితుల నుంచి ఫోన్ వచ్చిన వెంటనే స్పందించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ టెక్నీషియన్ కె.అఫీస్, పైలట్ చిన్న, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణానికి సహకరించాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసు సిబ్బంది

పోలాకి: గ్రామాల్లో శాంతియుత వాతావరణానికి ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు. నరసన్నపేట సీఐ బి.ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం వనవిష్ణుపురం గ్రామంలో స్థానికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో సమస్యాత్మక పరిస్థితులు నెలకొన్న గ్రామాల్లో ముందస్తు చర్యలు కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఫలితాలు వచ్చిన రోజు, ఆ తర్వాత గ్రామంలో ఎలాంటి వివాదాలు, ఘర్షణలు లేకుండా పెద్దలే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అలా కాకుండా రాజకీయాల కోసం వివాదాల్లోకి వస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలాకి ఎస్ఐ సత్యనారాయణ, హెచ్‌సీ అప్పన్న, సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- రాత్రిపూట ట్రాక్టర్లతో మట్టి తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు


చెరువులో మట్టి తవ్వకాలు జరిగిన దృశ్యం

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం గ్రామంలో ఉన్నటువంటి తామర చెరువులో రాత్రిపూట యథేచ్ఛగా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. 2 ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో ఆ గ్రామానికి చెందిన జేసీబీ యజమాని, టీడీపీ మద్దతుదారుడు రాత్రిపూట మట్టి తవ్వకాలు చేపట్టి, వాటిని ట్రాక్టర్లతో పలు ప్రాంతాలకు తరలిస్తూ విక్రయించుకుంటున్నాడు. గత కొన్ని రోజులుగా ఇక్కడ సుమారు 60 సెంట్లు విస్తీర్ణంలో మూడు అడుగుల లోతులో ఈ మట్టి తవ్వకాలు రాత్రి పూట జరుగుతున్నాయి. చెరువుకు కూతవేటు దూరంలోనే సచివాలయం ఉన్నా దీనిపై ఏ ఒక్కరూ దృష్టి సారించకపోవడం విచారకరం. ప్రస్తుతం ధర్మలక్ష్మీపురం, నౌతళ, హిరమండలం మండలంలోని ధనుపురం, పాతపట్నం మండలంలోని సీది, తదితర గ్రామాల సమీపంలో రియల్ ఎస్టేట్ కోసం భూములు కొనుగోలు చేసి వాటిని ప్లాట్లుగా తయారు చేస్తున్నారు. దీనికోసం ధర్మలక్ష్మీపురం నుంచి అక్రమంగా చెరువులో తవ్వకాలు చేపట్టిన మట్టిని ఒక్కొక్క ట్రాక్టర్ రూ.400 నుంచి రూ.550 చొప్పున విక్రయిస్తున్నాడు. ఇప్పటివరకు తామర చెరువు నుంచి సుమారు 200 ట్రాక్టర్లకు పైన లోడ్లు తరలించి విక్రయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ చెరువు జాతీయ రహదారి 326–ఏకు ఆనుకుని ఉన్నా, గత కొన్ని రోజులుగా అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై తహసీల్దార్ భాగ్యవతిని సంప్రదించగా చెరువులో మట్టిని అక్రమంగా తవ్వడం నేరమని పేర్కొన్నారు. స్థానిక వీఆర్వో, ఆర్ఐలను పరిశీలనకు పంపించి పరిశీలించి, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలియజేశారు.